క్లుప్తంగా

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



ప్రత్తిపాడు: హౌసింగ్ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ టి.సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడులో గురువారం ఆయన పర్యటించారు. 2018–19, 2020–21లో జగనన్న లేఅవుట్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించుకునేందుకు అదనంగా రూ.50 వేలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక ఏఈతో పరిశీలించారు. తొలుత ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈ ఎస్.వీరాంజనేయులతో తిక్కిరెడ్డిపాలెంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రత్తిపాడు: డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా గురువారం ప్రత్తిపాడులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. దోమ పుట్టకుండా, కుట్టకుండా నివారిద్దాం.. అప్రమత్తతే రక్ష.. అంటూ నినాదాలు చేశారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలంటే తొలి దశలోనే దోమల లార్వాను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం లక్ష్మీప్రసన్న, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ



ప్రత్తిపాడు: గుంటూరు లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో గురువారం వ్యవసాయ విద్యార్థులకు భూసార పరీక్షలు, ప్రాముఖ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూసార పరీక్షలకు మట్టిని ఎలా సేకరించాలి.. ఏయే పరీక్షలు చేయాలి.. ఫలితాలు.. ప్రయోజనాలపై విద్యార్థులకు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల పొలంలో మట్టి నమూనాలను సేకరించే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వంగ నవీన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

పట్నంబజారు: తల్లి మందలించిందనే కోపంతో గురువారం యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీలాల్‌నగర్‌కు చెందిన బి.సాయికుమార్ (28) నిత్యం మద్యం తాగుతూ పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. తల్లి మంగమ్మ పనికి వెళ్లమంటూ మందలించింది. దీంతె మనస్తాపానికి గురైన సాయికుమార్ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

డీఎస్పీ అరవింద్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ ఆధారిత మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని గుంటూరు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ కుమార్ సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా డీఎస్పీ అరవింద్‌కుమార్ పాల్గొన్నారు. షేర్ మార్కెట్, లోన్ యాప్స్ మోసాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వివిధ సైబర్ క్రైమ్స్ గురించి, వాటి భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు విద్యార్థులకు తెలియజేశారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి. సీతా రామయ్య, జె.శివజ్యోతి, సీహెచ్. ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అధ్వానంగా మంచినీటి చెరువు!



పచ్చని రంగులో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూసి ఇదేదో క్రీడా మైదానం అనుకుంటే నీళ్లల్లో కాలు వేసినట్లే. అవునండీ అక్షరాలా ఇది రక్షిత మంచినీటి చెరువు. ప్రత్తిపాడు మండలం వంగిపురంలోని మంచినీటి చెరువులో ఇలా పెద్ద ఎత్తున తామర మొక్కలు, తూడు పెరిగిపోయింది. దీంతో చెరువు అంతా ఇలా తామరాకులు, తూటాకుతో పచ్చగా కనిపిస్తోంది. పంచాయతీ అధికారులు సైతం చెరువును శుభ్రపరిచేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

\- ప్రత్తిపాడు

● నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు!



పెదకాకాని గ్రామం వడ్డెర కాలనీ ఎదుట ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో సుమారు 300 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా గతంలో శంకుస్థాపన చేయించారు. అనంతరం రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న లోతును సమీప వ్యర్థాలను ట్రాక్టర్లతో తరలించి సరిచేస్తున్నారు. గ్రావెల్‌తో సరిచేయించాల్సిన రోడ్డుకు నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలకు విరుద్ధంగా చెత్త, ముసుగుతో సైడ్‌బరమ్స్ వేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు స్థానికుల నుంచి వినబడుతున్నాయి.

\- పెదకాకాని

పార్టీలకు అతీతంగా వరి విత్తనాలు పంపిణీ చేయాలి



పెదకాకాని: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసుకునే రైతులకు పార్టీలకు అతీతంగా వరి విత్తనాలు పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు ముడియాల మల్లికార్జునరెడ్డి అధికారులను కోరారు. పెదకాకాని గ్రామంలోని నాలుగో సచివాలయంలో గురువారం మండల వ్యవసాయ అధికారి రమణకుమార్‌ను కలిసి వరి విత్తనాలు కోసం కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా, పార్టీలకు అతీతంగా విత్తనాలు పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. పార్టీ నాయకులు సుంకర కృష్ణారెడ్డి, వీర్ల వీరాంజనేయులు, రైతులు అంకమ్మరావు, ఆలపాటి పెద నాగేశ్వరరావు, ఉసర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి



చేబ్రోలు: ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది భవిష్యత్‌ను మలచే సాధనం మాత్రమే కాదని.. నేటి అవసరంగా మారిపోయిందని ఏపీఎస్ఎస్‌డీసీ మాజీ సీఈవో, ఎండీ గంటా సుబ్బారావు అన్నారు. విద్యార్థులు ఏ విభాగంలో ఉన్నా ఏఐపై అవగాహన పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ఏఐ–ఫోకస్డ్ యూనివర్సిటీ' అనే అంశంపై యూనివర్సిటీలోని ఆయా విభాగాల డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. పరిశ్రమలే కాదు.. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, ప్రజాసేవ వంటి అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందన్నారు. ఐఐటీ మద్రాస్ పూర్వ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎస్.శివ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యా, పరిశోధన, పరిశ్రమల మధ్య గల వ్యత్యాసాలను తగ్గించడానికి యూనివర్సిటీల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐతో కలిసి క్వాంటం టెక్నాలజీస్ విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

లక్ష్మీపురం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. బృందావన్ గార్డెన్స్, బేకర్స్ ఫన్ సెంటర్, లాడ్జి సెంటర్ తదితర ప్రధాన ప్రాంతాల్లో ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది, సీఐలు, ఎస్ఐలు తనిఖీలు చేపట్టారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ మాట్లాడుతూ వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలిపారు. ట్రిబుల్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు.

నూతన ఆవిష్కరణలతోనే దేశ ఆర్థిక పురోగతి



మాట్లాడుతున్న కర్ణాటక ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుప్రభా కేఆర్

ప్రత్తిపాడు: నూతన ఆవిష్కరణలతోనే దేశ ఆర్థిక పురోగతి సాధ్యపడుతుందని కర్ణాటక ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్, వాద్వాని ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ మెంబర్ డాక్టర్ సుప్రభా కేఆర్ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆర్‌వీఆర్ అండ్ జేసీసీఈ ఎస్‌టీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐటీబీఐ సహకారంతో 'ఐడియా, డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలిరోజు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సుప్రభా కేఆర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యావేత్తలు, పరిశోధకులు, యువ అధ్యాపకులకు ఆవిష్కరణాత్మక ఆలోచనలు, అభివృద్ధి చెందిన డిజైన్ పద్ధతులు, స్టార్టప్ వ్యాపారాల ప్రారంభానికి అవసరమైన ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్‌లో విద్యార్థుల మధ్య పోటీ పెరగనున్నదని తెలిపారు. కళాశాల అధ్యక్షులు డా.రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్.కె మాట్లాడుతూ.. ఏపీ సీఎం ఆశించిన విధంగా ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంట్రప్రెన్యూర్ తయారవ్వాలన్న అంశం సఫలీకృతం కావాలంటే విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్, రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకాడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డా.కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డా.ఎస్.వి.శ్రీనివాసరావు, ఐటీబీఐ ప్రధాన పరిశోధకులు డా. ఎంపీవీ చంద్రశేఖరరావు, ఇంక్యుబేషన్ మేనేజర్ డా.కె.శోభ, ఆర్‌జేఈ నెస్ట్ సీఈవో డా.ఆర్.హఫీజ్ బాషా, డా.సజ్జా రాధికా, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మలినేని మహిళా కళాశాల డైరెక్టర్ నియామకం



డాక్టర్ వెంకటేశ్వరరావును అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్‌గా డాక్టర్ కోమటి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. స్థానిక కళాశాలలో బుధవారం నూతనంగా నియమితులైన డైరెక్టర్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మలినేని కళాశాలల చైర్మన్ పెరుమాళ్లు డైరెక్టర్ వెంకటేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కళాశాల విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణల్లో ముందుకు సాగేందుకు కోమటి అనుభవం ఒక దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. వెంకటేశ్వరరావు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ డిగ్రీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పొందారని గుర్తు చేశారు. విద్యారంగంతో పాటు ఐటీ, ఇస్రో వంటి ప్రఖ్యాత ప్రభుత్వ సంస్థల్లో కూడా పని చేసిన అనుభవం ఆయనకు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జెట్టి అప్పారావు, డీన్లు డా.పోపూరి రమేష్, ప్రొఫెసర్ జంపని కిషోర్ బాబు, ఇతర విభాగాధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఊహారాణి

చేబ్రోలు: బ్యాంక్ ఖాతాదారులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఖాతాదారుల చైతన్య, అవగాహన సదస్సు) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఖచ్చితమైన లావాదేవీలు నడపాలని, డిఫాల్టర్‌గా ఉండకూడదని, సిబిల్ స్కోర్ కలిగి బ్యాంకు ద్వారా రుణాన్ని పొంది వ్యాపారాభివృద్ధి పొందాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఎంపీడీవో టి.ఊహారాణి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి సంపాదనలో 20 శాతం పొదుపు చేయడం అనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు ముఖ్య ఉద్దేశ్యమని, దీనిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మహిళలు పొదుపు చేయడం ద్వారానే అభివృద్ధి సాధించగలరన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సర్వే ప్రకారం పురుషుల కంటే మహిళలు సంపాదనలో 84 శాతం పొదుపు చేస్తున్నారని అన్నారు. సూపరింటెండెంట్ ఏ.ఉమాదేవి, వెలుగు ఏపీఎం శ్రీలక్ష్మి, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, వెలుగు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేనేం పాపం చేశాను తాతా!!

పోషించలేక, సంరక్షించకలేక మనవరాలిని మట్టుబెట్టిన తాత



నిందితుడు మాధవరావు(ఫైల్)

తాడేపల్లి రూరల్: పూర్తిగా లోకం తెలియని బాలిక.. పుట్టుకతోనే మూగ, చెవుడు. పుట్టిన ఏడాదికే తల్లిని కోల్పోయింది. ఎనిమిదో ఏట విధి వక్రించడంతో తండ్రిని కూడా కోల్పోయింది. అప్పటి నుంచి నాయనమ్మ, తాతయ్య దగ్గర పెరుగుతోంది. బాలికకు మతిస్థిమితం లేదని కంటికి రెప్పలా చూసుకుంటూ సంరక్షిస్తున్నారు. కాలం కలిసి రాక నాయనమ్మ మంచాన పడింది. దీంతో బాలికను సంరక్షించలేక సొంత తాతే ఆ మనవరాలిని మట్టుబెట్టాడు. ఇటీవల జరిగిన ఈ ఘటనపై పోలీసులు నిందితుడిగా తాత మాధవరావును గుర్తించి గురువారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వివిధ వర్గాల నుంచి సేకరించిన వివరాల ప్రకారం .. కూరపాటి మాధరావు(బుల్లి), సుమతి దంపతుల కుమారుడు రాజు. రాజు భార్య బుజ్జి. వీరికి హేమ జన్మించింది. హేమకు పుట్టుకతోనే చెవుడు, మూగతో మతిస్థిమితం. హేమ ఏడాది వయస్సులో తల్లి బుజ్జి రెండో సారి గర్భం దాల్చగా కాన్పు సమయంలో ధనుర్వాతం వచ్చి మృతి చెందింది. తండ్రి రాజు హేమకు 8 ఏళ్లు వచ్చే సమయానికి మృతి చెందాడు. అప్పటి నుంచి వారి నాయనమ్మ సుమతి, తాతయ్య మాధవరావు సంరక్షణలో హేమ ఉంది. హేమకు 13 ఏళ్లు వచ్చాయి. నానయమ్మ సుమతి అనారోగ్యం బారిన పడడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తాతయ్య మాధవరావు మనవరాలు హేమను ఇంటి నుంచి ఆసుపత్రికి, అక్కడి నుంచి ఇంటికి తనతో తిప్పుకొంటూ గత నాలుగు రోజుల నుంచి చూసుకుంటున్నాడు. మతిస్థిమితం గల మనవరాలిని మేము కూడా లేకపోతే ఎవరు చూసుకుంటారన్న ఆలోచన.. తమ తదినంతరం బాలికను ఎవరు సాకుతారన్న ఉద్దేశ్యంతో తాత మాధవరావు పాపను కడతేర్చాలని నిర్ణయించుకున్నాడు. దీంతో మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై కుంచనపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి మీద నుంచి బాలికను కాలువలోకి తోసి కడతేర్చాడు. ఘటనపై సీఐ వీరేంద్రబాబును వివరణ అడుగగా.. బాలికను హత్యచేసిన తాతయ్యను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి విచారణ అనంతరం కోర్టుకు హాజరు పరుచనున్నట్లు ఆయన తెలిపారు.

కారు ఢీకొని తాపీ మేస్త్రి దుర్మరణం

మేడికొండూరు: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్‌లోని చంద్రయ్య పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం వెంగళపాలెం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ భాష(45) తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. పని ముగిసిన అనంతరం తన స్నేహితుడితో కలిసి పెట్రోల్ కొట్టించేందుకు పెట్రోల్ బంకు వద్దకు వచ్చాడు. నాగూర్ భాష బైక్ దిగి రోడ్డుపై ఉండగా పేరేచర్ల నుంచి వస్తున్న కారు నాగూర్ భాషను వెనుకగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య మదార్‌బి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేడికొండూరు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీసీలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

నెహ్రూనగర్: రాష్ట్రంలో బీసీలపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుగుంటలోని కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయాన అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆ దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీసీలు వెన్నెముక అని చెప్పుకునే టీడీపీ పార్టీ వారికి చేసిన న్యాయం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్న చట్టాలకు మాదిరిగా బీసీలకు కూడా అమలు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, దొంత బ్రహ్మం, యేటి కోటేశ్వరరావు, ప్రసన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్ కల్పించాలి

ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి

నగరంపాలెం: ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ) జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 'హమ్ బద్లెంగే' క్యాంపెనింగ్‌ను గురువారం గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ చౌదరి మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని, అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని కోరారు. పేపర్ లీక్‌లను అరికట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని, విద్యార్థులకు తక్షణమే ఉపకారవేతనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నాగమధుయాదవ్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి రాజీవ్‌గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి (ఆర్గనైజేషన్/అడ్మినిస్ట్రేషన్) వేముల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కరీం, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 28న బ్రాడీపేట 4/7వ లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా, స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా జీజీహెచ్‌కి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ జూన్ 30న మృతి చెందాడు. వయస్సు 40 సంవత్సరాలు ఉంటుంది. బ్రాడీపేట పరిసర ప్రాంతాల్లో విచారించినా వివరాలు తెలియక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ (0863–2231955) లేదా సీఐ ఆరోగ్య రాజు 8688831332 నంబర్లను సంప్రదించాలి.

విద్యుత్ ఒప్పందాలతో ప్రజలపై పెనుభారం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు

నెహ్రూనగర్ : ఆదానీ, షిర్డీ సాయి తదితర ప్రైవేట్ కంపెనీలతో అధికార పార్టీలు గత దశాబ్ద కాలంగా చేసుకున్న విద్యుత్ ఒప్పందాలపై పునఃసమీక్ష అవసరమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్. బాబూరావు డిమాండ్ చేశారు.అవినీతికి పాల్పడిన సంస్థలపై, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలంతా స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని కార్యాలయంలో 'విద్యుత్ కుంభకోణాలు – వినియోగదారులపై భారాలు' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాబూరావు మాట్లాడుతూ అదానీ చేసుకున్న సెకీ ఒప్పందం రాబోయే 25 సంవత్సరాలలో రాష్ట్ర ప్రజలపై రూ.1,20,000కోట్ల భారం పడుతుందని వివరించారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ చేపట్టిన ఒప్పందాల ద్వారా వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని తెలిపారు. లోపభూయిష్టమైన విద్యుత్ ఒప్పందాలను ఉప సంహరించుకునేలా పౌర సమాజం పెద్దఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సౌర విద్యుత్ పేరుతో ఇండోసోల్ కంపెనీ 8,500 ఎకరాల పంట భూములను ప్రత్యేకంగా అత్యున్నతమైన మామిడి పండ్లు కాచే కరేడు, ఉలవపాడు ప్రాంతాల నుంచి సేకరించడం ప్రమాదకరమని హెచ్చరించారు. రైతులు సంఘటితమైతే భూ సేకరణను తిరస్కరించాలని తెలిపారు. నాడు పంపు సెట్లకు బిగించ తలపెట్టిన స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన తెలుగుదేశం నేతలు నేడు ఇళ్లకు బిగించాలని పూనుకోవడం మోసపూరితమని పేర్కొన్నారు. నాడు షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ జగన్‌మోహన్‌రెడ్డి బినామీ సంస్థ అంటూ ప్రచారం చేసి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిన తెలుగుదేశం పార్టీ అగ్రనేతలు నేడు ఆ సంస్థతోనే విద్యుత్ ఒప్పందాలు చేసుకోవడం వారి ద్వంద్వ నీతిని బహిరంగ పరుస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, విశ్రాంత అడిషనల్ ఎస్పీ చలపతిరావు, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ, చావా శివాజీ ప్రసంగించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి సూచించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ ప్రజలంతా బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం వల్ల పచ్చదనంతో పాటు వాతావరణంలో మార్పులు వస్తాయని పేర్కొన్నారు. భావి తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత కనీసం రెండు మొక్కలు నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అనితా దేవి, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి జేవీ సుధీర్ కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి యు.రవికుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సమావేశానికి హాజరైన పోస్టల్ సబ్‌మాస్టర్



లక్ష్మీపురం: కేంద్ర కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జె.మాధవరావ్ సింధియా బుధవారం ఢిల్లీలో దేశవ్యాప్తంగా 23 సర్కిళ్లకు చెందిన పోస్టల్ సార్టింగ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. దీనికి రాష్ట్రం నుంచి గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని స్తంభాల గరువు, చౌదరిపేట సబ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ షబీనా బేగం హాజరయ్యారు. వ్యూహాత్మక సమన్వయం, ఆవిష్కరణల ద్వారా ఇండియా పోస్ట్‌ను మార్చడానికి ఒక స్పష్టమైన భవిష్యత్ ప్రణాళికను తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ తరఫున షేక్ షబీనా బేగం హాజరవడం అభినందనీయం అని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొనేందుకు సహకరించిన డివిజన్ పోస్టల్ సూపరిటెండెంట్, యూనియన్ నాయకులకు షబీనా బేగం కృతజ్ఞతలు తెలిపారు.